# కాణిపాకం ఆలయానికి 11.11 లక్షలు విరాళం

కాణిపాకం, జనవరి 11 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి పథకాలకు ఓ భక్తుడు గురువరాం 11.11 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్ మియాపూర్‌కు చెందిన ఎం.మురళీకృష్ణ అనే భక్తుడు శాశ్వత నిత్యాన్నదాన పథకంకు ఐదు లక్షల రూపాయలను, సిద్ధి వినాయక గోసం రక్షణ ట్రస్ట్‌కు 5,11,111 రూపాయలను, ఉదయాస్తమయ సేవకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొత్తాన్ని చెక్ రూపంలో కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి,శ్రీధర్‌బాబులకు అందజేశారు. ఈకార్యక్రమంలో టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

# తిరుపతి - చిత్తూరు



తెలుగు జాతీయ దినపత్రిక
వార్త



## చిరు వ్యాపారులకు అండగా

# సిఎం జగన్

## జిల్లాలో జగనన్న తోడు కింద 15,085 మందికి రూ.15.96 కోట్లు లబ్ది : ఎంపీ రెడ్డప్ప



జగనన్న తోడు లబ్దిదారులకు మెగా చెక్కును అందిస్తున్న ఎంపీ రెడ్డప్ప, తదితరులు

చిత్తూరు, జనవరి 11 ప్రభాతవార్త:

చిరువ్యాపారులకు సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అండగా నిలిచి జగనన్న తోడు క్యాక్రమం ద్వారా లబ్ది చేకూరేలా చర్యలు తీసుకొంటున్నారని ఎంపీ రెడ్డప్ప అన్నారు. 8వ విడత జగనన్న తోడు పథకం లబ్దిని సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం తాడేపల్లి సిఎం క్యాంపు కార్యాలయం నుండి వర్చువల్ విధానంలో లబ్దిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కలెక్టరేట్ నుండి ఈ కార్యక్రమంకు వర్చువల్ విధానంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపీ రెడ్డప్ప, కలెక్టర్ సగిలి షన్మోహన్, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ రాజశేఖర్, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ రెడ్డప్ప మాట్లాడుతూ నిరుపేదలైన చిరు వ్యాపారులు, హస్తకళాకారులు, సాంప్రదాయ చేతివృత్తుల వారిని వారి కాళ్ళమీద నిలబెడుతూ ఒకొక్కరికి ప్రతి ఏడాది రూ.10 వేల రుణం, సున్నా వడ్డీని అందిస్తూ రుణాలు తీసుకొని వాటిని సకాలంలో తిరిగి చెల్లించిన వారికి రూ.10 వేలకు అదనంగా ఏడాదికి మరో వెయ్యి రూపాయలు ఇస్తూ రూ.13 వేల వరకు వడ్డీ లేని రుణం అందించడం జరుగుతుందన్నారు. కలెక్టర్ సగిలి షన్మోహన్ మాట్లాడుతూ జిల్లాలో 15,085 మందికి రూ.15.96 కోట్ల లబ్ది చేకూరుతుందని, ఇందులో అర్బన్ పరిధిలో 4,347 మంది లబ్దిదారులకు రూ.4.60 కోట్లు, గ్రామీణ ప్రాంతాల్లో 10,738 లబ్దిదారులకు రూ.11.36 కోట్లు జమ కావడం జరిగిందన్నారు. అలాగే క్రమం తప్పకుండా బ్యాంకు రుణాలు తిరిగి చెల్లించిన చిరు వ్యాపారులకు సాంప్రదాయ వృత్తి వ్యాపారులకు ప్రభుత్వం వడ్డీ తిరిగి చెల్లించే కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 28,450 మందికి రూ.76.23 లక్షలు జమ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మహిళా స్థాయి సంఘ ఛైర్మన్ భారతి, డిఆర్‌డిఎ పిడి డిఎంకె తులసీ, జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, జిల్లా యువజన సంక్షేమ అధికారి ప్రదీప్‌కుమార్, లబ్దిదారులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## వైసిపి మూడో జాబితా

# తిరుపతి జిల్లాలో ముచ్చటగా ముగ్గురికి స్థానం

## సత్యవేడు ఇన్‌ఛార్జిగా డాక్టర్ గురుమూర్తి -తిరుపతి పార్లమెంట్‌కు కోనేటి ఆదిమూలం -గూడూరుకు మేరిగ మురళీధర్

తిరుపతి,జనవరి 11ప్రభాతవార్త:







రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ముందస్తుగా అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలకు ఇన్‌ఛార్జిల పేరుతో అభ్యర్థులను ఖరారుచేస్తోంది. తాజాగా గురువారం రాత్రి వైసిపి అధిష్టానం నియమించిన 21మంది అభ్యర్థుల్లో తిరుపతి జిల్లాలో సత్యవేడు(ఎస్సీ) అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా డాక్టర్ మద్దిల గురుమూర్తిని, గూడూరు అసెంబ్లీ ఇన్‌ఛార్జిగా మేరిగ మురళీధర్‌ను, తిరుపతి పార్ల మెంట్‌కు కోనేటి ఆదిమూలం పేర్లను ఖరారుచేసింది. ఇకపై వీరంతా ఆయా నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేసుకోవడం, పార్టీ నేతలు, కార్యకర్తలను సమన్వయం చేసుకుని ఎన్నికలకు సమాయత్తం కావలసి వుంది. ప్రస్తుతం తిరుపతి ఎంపిగా కొనసాగుతున్న డాక్టర్ మద్దిల గురుమూర్తిని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థిగా నియమించారు. అక్కడ ఆయన స్థానిక నేతలతో కలసిపనిచేయాల్సి ఉంటుంది. తిరుపతి ఎంపిగా ఆయన పనితీరుపై ప్రజలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపధ్యంలో ఆయన సత్యవేడులో పరపతిని కాపాడుకోవడంపై దృష్టి సారించాల్సి ఉంది. గూడూరు (ఎస్‌సి)అసెంబ్లీకి ఇన్‌ఛార్జిగా నియమితులైన మేరిగ మురళీధర్ ప్రస్తుతం ఉమ్మడి నెల్లూరుజిల్లా స్థానిక సంస్థల ఎంఎల్‌సిగా గత ఏడాది మార్చినెలనుండి కొనసాగుతున్నారు. ఈయన ఎంఎల్‌సిగా ఉన్నప్పటికీ గూడూరు ప్రాంత ప్రజలు, వైసిపి నాయకులను సమన్వయం చేసుకుని రానున్న ఎన్నికలకు సిద్ధం కావలసి ఉంది. తిరుపతి పార్లమెంట్(ఎస్‌సి) స్థానానికి సత్యవేడు సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కోనేటి ఆదిమూలంను నియమించారు.

ఆయన తిరుపతి పార్లమెంట్ ఎన్నికలకు పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలసి పనిచేయాల్సి ఉంది. ఈ ముగ్గురి స్థానాలు మారడంతో వీరి జాతకాలు ఎలా ఉండను న్నాయనేది మరో నాలుగునెలలు వేచిచూడాల్సిందేనని తిరుపతి జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు.

## చిత్తూరు వైకాపా అభ్యర్థిగా ఎంసి విజయానందరెడ్డి

చిత్తూరు, జనవరి 11 ప్రభాతవార్త:



చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా అభ్యర్థిగా ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి పేరును వైకాపా అభ్యర్థి ఖరారు చేసింది. ఈ మేరకు ఆర్టీసీ వైస్ ఛైర్మన్ చిత్తూరు నియోజకవర్గ పార్టీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టనున్నారు. ప్రస్తుతం చిత్తూరు సిట్టింగ్ ఎమ్మెల్యేగా వ్యవహరిస్తున్న ఆరణి శ్రీనివాసులును వైకాపా అధిష్టానం రాజ్యసభ అభ్యర్థిగా ఎంపిక చేసింది. చిత్తూరు వైకాపా అభ్యర్థిత్వంపై గత నాలుగు సంవత్సరాలుగా దృష్టి కేంద్రీకరించిన ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి సేవా, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లోకి దూసుకెళ్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలోని భార్య,భర్తలందరికీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి జనదినం, క్రిస్మస్, సంక్రాంతి శుభాకాంక్షలతో దుస్తులు పంపిణీ చేశారు. ఇది వరకే ఆర్టీసీ వైస్ ఛైర్మన్ ఎంసి విజయానందరెడ్డి మార్కెట్ పన్ను వసూళ్ళను తన సొంత నిధులు చెల్లించి దుకాణదారులు, వర్తకులు, తోపుడుబండ్లు, మార్కెట్ వ్యాపారులకు ఫీజు లేకుండా చేశారు. అలాగే చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో సైకిల్ స్టాండ్ గేటును సైతం తన డబ్బులు చెల్లించి ఉచితం చేశారు. ఎవరైనా ఆపద అని వస్తే వారికి చేతనైన సహాయం చేసి ఆదుకొంటున్నారు. ఈ పరిస్థితుల్లో వైకాపా అధిష్టానం ఎంసి విజయానందరెడ్డికి చిత్తూరు అభ్యర్థిత్వం ఖరారు చేసింది.

## పూతలపట్టు వైకాపా అభ్యర్థిగా డాక్టర్ సునీల్ ఖరారు

చిత్తూరు, జనవరి 11 ప్రభాతవార్త:



పూతలపట్టు అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా అభ్యర్థిగా డాక్టర్ సునీల్ పేరును వైకాపా అధిష్టానం ఖరారు చేసింది. ఈ మేరకు డాక్టర్ సునీల్ పూతలపట్టు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. 2014 ఎన్నికల్లో పూతలపట్టు ఎమ్మెల్యేగా వైకాపా తరపున పోటీ చేసి విజయం సాధించిన డాక్టర్ సునీల్‌కు 2019 ఎన్నికల్లో వైకాపా అధిష్టానం అభ్యర్థిత్వం ఖరారు చేయ్యలేదు. 2019 ఎన్నికల్లో పూతలపట్టు నుండి చిత్తూరు రూరల్ మండలానికి చెందిన ఎంఎస్ బాబుకు వైకాపా అధిష్టానం అభ్యర్థిత్వం ఖరారు చేసింది. ఈ మేరకు 2019 ఎన్నికల్లో ఇక్కడి నుండి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన ఎంఎస్ బాబు విజయం సాధించారు. 2024 ఎన్నికల్లో సిట్టింగ్ ఎమ్మెల్యే ఎంఎస్ బాబుకు వైకాపా అధిష్టానం అభ్యర్థిత్వం తిరస్కరించడంతో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్ పేరు తెరపైకి వచ్చింది. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రత్యేకంగా పూతలపట్టు నుండి డాక్టర్ సునీల్ అయితే ఎలా వుంటుందని జిల్లాకు చెందిన ముఖ్య నేతలను పలుమార్లు అడుగడంతో జిల్లా నేతలు ఇతర పేర్లను సిఎం వైఎస్ జగన్ వద్ద ప్రతిపాదించడానికి ధైర్యం చేయలేదని తెలిసింది. ఈ పరిస్థితుల్లో డాక్టర్ సునీల్‌ను వైకాపా అధిష్టానం పూతలపట్టు నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జిగా నియమించింది.

## బొలోరో వాహనం ఢీ

## ఇద్దరు దుర్మరణం

గంగవరం, జనవరి 11, ప్రభాతవార్త :



మృతి చెందిన నారాయణప్ప,రాజేష్‌ల ఫైల్ ఫోటోలు

బొలోరో వాహనం డీకొన్న ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది.ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి కథనం మేరకు వివరాలిలా..పలమనేరు పట్టణం ఎంబిటి రోడ్డులో నివాసం ఉంటున్న రామాచారి కుమారులు రాజేష్(44), లోకేష్(38)లు వృత్తిరిత్యా వెల్డింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగించేవారు.ఈ నేపథ్యంలో అన్నదమ్ములు ఇద్దరు కలిసి పెద్దపంజాణి మండలం శంకరాయల్‌పేట నందు వెల్డింగ్ షాపును నిర్వహించేవారు.ఈ క్రమంలో గురువారం ఉదయం అన్నదమ్ములతో పాటు తమ షాపులో పని చేస్తున్న పట్టణానికి చెందిన నారాయణ(54)లు కలిసి పలమనేరు నుండి తమ ద్విచక్రవాహనంలో శంకరాల్‌పేటలోని తమ షాపుకు వెళ్తుండగా పలమనేరు,శంకరాయల్‌పేట రహదారిపై మాదిగిండ్లు సమీపంలోని మలుపు వద్ద శంకరాయల్‌పేట వైపు నుండి పలమనేరు వైపు వస్తున్న బొలోరో పాల వ్యాన్ వేగంగా,అజాగ్రత్తగా వచ్చి ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని డీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనంలో వెళ్తున్న నారాయణప్ప అక్కడికక్కడే దుర్మరణం చెందగా అన్నదమ్ములు రాజేష్,లోకేష్‌లు తీవ్రంగా గాయపడ్డారు.తీవ్రంగా గాయపడ్డ వారిని స్థానికులు పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా రాజేష్ తీవ్ర రక్తస్రావంతో మార్గ మధ్యలోనే మృతి చెందాడు.లోకేషకు ప్రథమ చికిత్స అనంతరం వేలూరు సిఎంసికి తరలించారు.విషయం తెలుసుకున్న ఎస్ఐ సిబ్బందితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహన్ని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.మృతులకు భార్య పిల్లలు ఉన్నారు.బతుకుతెరువుకు వెళ్తూ విగత జీవులుగా మారడంతో పలువురి హృదయాలను కలచివేసింది.

## స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో

# తిరుపతి కార్పొరేషన్‌కు అవార్డుల పంట




తిరుపతి కార్పొరేషన్, జనవరి 11, ప్రభాతవార్త

స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో తిరుపతి నగర పాలక సంస్థ అవార్డుల మోత మోగించింది. పది లక్షల జనాభా కలిగిన పట్టణాల్లో రెండవ ర్యాంకు, జాతీయ స్థాయిలో క్లినేస్ట్ సిటీగా తిరుపతి నగర పాలక సంస్థకు జతీయ స్థాయి 8వ ర్యాంకు సాధించింది. మరోమారు వాటర్ ప్లస్ సిటి గాను, గార్బేజ్ ఫ్రీ సిటీగా కూడా సర్టిఫికేషన్ కూడా పొందడం జరిగిందన్నారు. గురువారం న్యూఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన 2023 స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖా మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి చేతుల మీదుగా ఈ అవార్డులను నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, అధికారులు అందుకున్నారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ టిటిడి చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి, డిప్యూటీ మేయర్లు అభినయ్ రెడ్డి, కార్పొరేటర్ల సూచనలు, నగర ప్రజలు, ప్రజారోగ్య కార్మికులు, అధికారులు సమిష్టి కృషి, సహకారంతోనే జాతీయ స్థాయిలో ఈ అవార్డులు దక్కాయని అన్నారు. తిరుపతి నగర పాలక సంస్థ స్వచ్ఛ సర్వేక్షణ్ 2023లో అవార్డులు సాధించడం పట్ల పలువురు కార్పొరేటర్లు, అధికారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, డిఈ విజయకుమార్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కొత్త శానంబట్లలో

# జల్లికట్టు సంబరాలు



రామచంద్రాపురం, జనవరి 1 ప్రభాతవార్త:

మండలంలోని అనుప్పల్లి పంచాయతీ, గోకులాపురంలో గురువారం జల్లికట్టు సంబరాలు అంబరాన్నంటేలా నిర్వహించారు. ఏడాదికి ఒకమారు ఏరువాక ముగిశాక పశువులకు పూజలు నిర్వహించి పండుగ జరుపుకోవడం సంప్రదాయంగా వస్తున్నది. చెక్కను అందంగా మలిచి కొమ్ములకు కట్టి పౌరుషంతో రంకెలేస్తున్న పశువులను జనంలోకి వదలిపెట్టారు. పశువుల కొమ్ములకు కట్టిన పట్టీని సొంతం చేసుకోవడాన్ని పౌరుషానికి ప్రతీకగా భావించే యువత పోటెత్తిన ఉత్సాహంతో ముందుకు దూకారు. పట్టీని సొంతం చేసుకునే వారు కొందరైతే, ఆ ప్రయత్నంలో గాయాల పాలైన వారు మరికొందరు జల్లికట్టు సంబరాలను ఆస్వాదించారు.

# హనుమజ్జయంతి వేడుకల్లో మంత్రి రోజా

నగరి, జనవరి 11 ప్రభాతవార్త:




మండల, మున్సిపల్ పరిధిలో హనుమజ్జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మున్సిపల్‌పరిధి సత్రవాడలో టీటీడీ ఆధీనంలోని కరివరదరాజస్వామి ఆలయంలోని వీరాంజనేయ స్వామి ప్రాకారంలో నిర్వహించిన హనుమజ్జయంతి వేడుకల్లో మంత్రి రోజా పాల్గొన్నారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, విశేష అలంకరణ, అర్చనల్లో ఆమె పాల్గొని పూజలు చేసి కర్పూర హారతులు స్వీకరించారు. స్వామివారి జయంతి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిస్వామివారి దర్శనం చేసుకున్నారు. వేద పండితులు ఆమెకు ప్రసాదాలు అందజేసి వేదమంత్రాలతో ఆశీర్వదించారు. కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఏఈవో, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ బాలకృష్ణ, జిల్లా నేత అనుబంధ సంఘ అధ్యక్షులు కన్నాయిరం, వైస్ చైర్మన్ బాలన్, కౌన్సిలర్ మురుగ, కో-ఆప్షన్ సభ్యులు ఆనందకుమార్, ఆలయ పాలక మండల సభ్యులు, సత్రవాడ వైసీపీ శ్రేణులు పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణంలోని ప్రసన్నాంజనేయస్వామి సన్నిధిలో స్వామిని అరటి పండ్లతో అలంకరించడం అందరిని ఆకట్టుకుంది. పలువురు దర్శించుకున్నారు.

# అంబేద్కర్ ఛాయా చిత్ర ప్రదర్శనను తిలకించిన కలెక్టర్

తిరుపతి కార్పొరేషన్, జనవరి 11, ప్రభాతవార్త

సామాజిక సమతా సంకల్ప స్ఫూర్తిగా జిల్లా కలెక్టరేట్ ఆవరణ నందు ఏర్పాటు చేసిన డా. బాబా సాహెబ్ అంబేద్కర్ ఛాయా చిత్ర ప్రదర్శనను గురువారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యే ఆదిమూలంతో కలిసి తిలకించారు. అంతకు మునుపు వారు డా. బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల జనవరి 19న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి విజయవాడలోని స్వరాజ్ మైదాన్‌లో దాదాపు రూ. 403 కోట్లతో సుమారు 18.18 ఎకరాలలో అంబేద్కర్ స్మృతివనం ఏర్పాటుతో 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సామాజిక న్యాయానికి స్ఫూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా ప్రారంభించనున్న నేపథ్యంలో సామాజిక సమతా సంకల్ప కార్యక్రమాలను జిల్లాలో ఈ నెల జనవరి 4 నుంచి 19 వరకు వివిధ కార్యక్రమాల నిర్వహణ కొరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు షెడ్యూల్ అమలు చేసుకుని తదునుగుణంగా జిల్లాలో చేపడుతున్నారు. జిల్లా ప్రధాన కేంద్రంలో అంబేద్కర్ స్ఫూర్తిదాయక ఛాయా చిత్ర ప్రదర్శనలో ఏర్పాటు చేసిన సంతకాల సేకరణ ఫ్లెక్సీపై కలెక్టర్, ఎంఎల్‌సి, ఎమ్మెల్యే, డిఆర్ఓ, తదితర అధికారులు, ప్రజలు సంతకాలు చేసారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పెంచల కిషోర్, సాంఘిక సంక్షేమ సాధికార అధికారి చెన్నయ్య, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి బాల కొండయ్య, పిడి, డిఆర్‌డిఎ జ్యోతి, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.



అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి,

# ఎన్నికల నిర్వహణకు పక్కా ఏర్పాట్లు

## - కోలారు పోలీసు కమీషనర్ కార్యాలయంలో అంతర్‌రాష్ట్ర సరిహద్దు సమన్వయ సమావేశం



చిత్తూరు, జనవరి 11 ప్రభాతవార్త: రాష్ట్రంలో జరుగనున్న ఎన్నికలను దృష్టిలో వుంచుకొని ఎస్పీ రిశాంత్‌రెడ్డి ఆదేశాల మేరకు పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి, జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు గురువారం కర్నాటక కోలారు జిల్లా పోలీసు కమీషనర్ కార్యాలయంలో కోలార్, కృష్ణగిరి, కెజిఎఫ్, అన్నమయ్య జిల్లా పోలీసులతో జరిగిన అంతర్‌రాష్ట్ర సరిహద్దు సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో పోలీసు ఉన్నత అధికారులు ఎన్నికల సందర్భంలో పోలీసు స్టేషన్ల పరిధిలో తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై క్షుణ్ణంగా చర్చించారు. ఎన్నికల సందర్భంగా సరిహద్దు ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సిన చెక్‌పోస్టుల గురించి, సరిహద్దు ప్రాంతాల నుండి అక్రమ మద్యం, వస్తువుల తరలింపుపై, అంతర్‌రాష్ట్ర నేరస్తులు, వారి కదలికలపై, ఎక్సైజ్ శాఖ సహకారంతో నాటు సారా కట్టడిపై ఈ సమావేశంలో పోలీసు అధికారులు చర్చించారు. ఈ సమావేశంలో పలమనేరు డిఎస్పీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ జరుగనున్న ఎన్నికలను దృష్టిలో వుంచుకొని ఎన్నికల సమయంలో సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఇందుకు సరిహద్దు రాష్ట్ర పోలీసులు పూర్తి సహకారం అందించాలని కోరారు. అలాగే అక్రమ మద్యం రవాణాకు అడ్డుకట్ట వేసి అంతర్‌రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో గట్టి నిఘా వుంచడంతో పాటు ఎక్సైజ్ శాఖ అధికారులతో కలిసి వాహనాల తనిఖీలు, నాటు సారా కట్టడికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగే విధంగా అంతర్‌రాష్ట్ర పోలీసులతో పాటు చిత్తూరు జిల్లా పోలీసులు పక్కాగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కెజిఎఫ్ జిల్లా ఎస్పీ శాంతరాజ్, కోలార్ డిప్యూటీ పోలీసు కమీషనర్ అక్రమ్‌పాషా, కోలారు అడిషనల్ ఎస్పీ జగదీష్, ఎక్సైజ్ శాఖ అధికారులు, చిత్తూరు జిల్లా సరిహద్దు పోలీస్ స్టేషన్ల సర్కిల్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల చర్చలు సఫలం

గూడూరు, జనవరి 11, ప్రభాతవార్త



రాష్ట్ర కమిటి పిలుపు మేరకు పురపాలక కార్మికుల సమ్మె తాత్కాలికంగా విరమిస్తున్నట్లు గూడూరు సిఐటియు నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు జోగి శివకుమార్ మాట్లాడుతూ క్లీన్ ఎన్విరాన్మెంటల్ వర్కర్స్ జీతం 2024 జనవరి నుండి 21 వేల రూపాయిలు బేసిక్‌గా మారుతుంది. దీనికి సంబంధించి ఒక నెల జీతం బోనస్‌గా లేదా నెలకు 3000 - 2000 అయినా అదనంగా జీతం చెల్లించాలని కోరాం కానీ ప్రభుత్వ నిరాకరించింది. సంక్రాంతి కానుకగా వెయ్యి రూపాయలు కార్మికులందరికీ ఇవ్వటానికి సిద్ధమయిందన్నారు. అదే విధంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ శానిటేషన్ డ్రైవర్లకు 2024 జనవరి నుండి 24 వేలు బేసిక్ జీతంత అవుతుందన్నారు. రాజదాని ప్రాంతం లోని కార్మికులకు ప్రస్తుతం సిఆర్డిఏ వారు జీతాలు చెల్లిస్తున్నారు. వీరిని కూడా మున్సిపల్ కార్మికులుగా మార్చాలని మనం కోరాము దీనికి సంబంధించి త్వరలో సిఆర్‌డిఏ అధికారులతో మీటింగ్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ తెలిపారు. క్లీన్ ఎన్విరాన్మెంటల్ వర్కర్స్‌కు సంక్షేమ పథకాలు అమలు చేయటానికి ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఇంజనీరింగ్ విభాగంలోని జీవో ఆర్టీ నంబర్ 30లో సెమిస్టర్ బదులు జీతాలు పొందుతున్న కార్మికులకు వారం రోజుల్లో ఫైనాన్సు డిపార్టెంట్ ఆమోదం తీసుకొని సెమీస్ కెళ్ళి జీతాలు చెల్లిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. సర్టిఫికెట్స్ లేకుండా సెమీ స్కిల్ విధులు నిర్వహిస్తున్న కార్మికులకు స్టిల్ డెవలప్మెంట్ వారి ద్వారా కోర్సు డిజైన్ చేసి ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్స్ ఇచ్చిన తర్వాత పనికి తగిన జీతం చెల్లిస్తామని ప్రభుత్వం అంగీకరించిందన్నారు. జీవోలు రెండు మూడు రోజుల్లోకి ఇస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు గోపి బివి రమణయ్య, సురేష్, అడపాల ప్రసాద్, చంద్రయ్య, పెంచల్ ప్రసాద్, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## సిఎం జగన్‌తో రాష్ట్రానికి ఒరిగింది ఏమీ లేదు

- రాష్ట్ర తెదేపా కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా

**కుప్పం, జనవరి 11 ప్రభాతవార్త** సిఎం జగన్‌రెడ్డి పాలనతో రాష్ట్రానికి ఒరిగింది ఏమీ లేదని రాష్ట్ర తెదేపా కార్యదర్శి, కుప్పం పరిశీలకుడు గాజుల ఖాదర్ బాషా పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైకాపా అధికారంలో వచ్చాక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందుల పాలయ్యారన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులను వేధిస్తూ రాక్షసానందం పొందుతున్నారని ఆరోపించారు. మాట తప్పినేతగా జగన్ నిలిచిపోతారన్నారు. మరలా రా ష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. రా కదలిరా సభలకు ప్రజలనుంచి అనూహ్య స్పందన వస్తోందన్నారు. తెదేపా మేనిఫెస్టోపై ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. రైతులను వైకాపా పాలనలో పట్టించుకోలేదని ప్రాజెక్టుల్లో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో వైకాపా ఘోరంగా ఓడడం ఖాయమన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాకీర్, దేశం నేతలు రమేష్, అస్మతుల్లా, నరేష్ పాల్గొన్నారు.

## చిత్తూరు పార్లమెంట్ బిఎస్పీ అభ్యర్థిగా విజయ్‌కుమార్

**కుప్పం, జనవరి 11 ప్రభాతవార్త**



వచ్చే ఎన్నికల్లో చిత్తూరు పార్లమెంట్ బిఎస్పీ అభ్యర్థిగా సాంఘీక సంక్షేమ శాఖ మాజీ జాయింట్ డైరెక్టర్ విజయ్‌కుమార్ పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం కుప్పం నియోజకవర్గ బిఎస్పీ సమావేశం జరిగింది. కుప్పం ఇన్‌చార్జ్ శివాడి గోవిందు, జోనల్ కోఆర్డినేటర్లు గుర్రప్ప, విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షు డు సురేంద్రబాబు హాజరయ్యారు. డా॥ బిఆర్ అంబేద్కర్ కల్పించిన రాజ్యాంగ హక్కులను కాపాడుకో వాల్సి న అవసరం ఉందన్నారు. బిఎస్పీని అధికారంలో తేవాలని పిలుపునిచ్చారు. అంతకుముందు డా॥ అంబేద్కర్ విగ్రహంకు ఘన నివాళులు అర్పించారు. సమావేశంలో కుప్పం అధ్యక్షుడు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## తెదేపా సీనియర్ నేత మృతి.. చంద్రబాబు సంతాపం

**రామకుప్పం, జనవరి 11 ప్రభాతవార్త**



తెదేపా నేత, రాష్ట్ర ఈడిగ సాధికార సమితి సభ్యుడు కలవకుంట చంద్రశేఖర్ అనారోగ్యం తో మృతి చెందారు. పార్టీ అభివృద్ధికి ఈయన విశేష సేవలు అందించారు. కాగా చంద్రశేఖర్ మృతి పట్ల తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు ఓ ప్రకటనలో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. ఆయన కుటుబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## వైకాపా కార్యకర్త మృతి.. ఎమ్మెల్సీభరత్‌చే ఆర్థికసాయం

**రామకుప్పం, జనవరి11 ప్రభాతవార్త**



మండలంలోని ననియాల తాండాకు చెందిన వైకాపా కార్యకర్త లక్ష్మణ్ నాయక్ అనారోగ్యంతో మృతి చెందాడు. అతని మృతి పట్ల ఎమ్మెల్సీ భరత్ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి తన వంతు సాయంగా ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ బాబురెడ్డి, ఎంపిపి సుబ్రమణ్యం, నేతలు చంద్రారెడ్డి, హేమచంద్రారెడ్డి, మురుగేష్, కేశవరెడ్డి, భూషణ్‌నాయక్ పాల్గొన్నారు.

## బిసిల అభ్యున్నతికి తెదేపాతోనే సాధ్యం

**రామకుప్పం, జనవరి 11 ప్రభాతవార్త**

రాష్ట్రంలోని బిసి కులాల అభివృద్ధి తెదేపాతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి కన్వీనర్ వైద్యం శా ంతారా ం, పరిశీలకుడు ఖాదర్ బాషా, రాష్ట్ర నేత మునస్వామి పేర్కొన్నారు. గురువారం జయహో బిసి కరపత్రాలను రామకుప్పంలో పంచారు. వచ్చే ఎన్నికల్లో కుప్పంలో చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధనకు బిసిలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో నేతలు ఆన ందరెడ్డి, ఆంజనేయరెడ్డి,నరసింహులు,చిన్నికృష్ణ,నారాయణాచారి,రామూర్తి, జయశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పరమహంసలో ఘనంగా సంక్రాంతి సంబరాలు

**శాంతిపురం, జనవరి 11 ప్రభాతవార్త**



మండలంలోని శ్రీ పరమహంస యోగానంద విద్యాలయంలో సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ఆజాద్ హుసేన్ మాట్లాడుతూ భోగి, సంక్రాంతి, కనమ పండగ ప్రాధాన్యతను వివరించారు. ఈసందర్భంగా విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

**కార్వేటినగరం,జనవరి 11 ప్రభాతవార్త:**

ప్రభుత్వ మద్యం దుకాణాలతో పాటు పరిసరప్రాంతాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని చిత్తూరు మద్యం డిపో సబ్-ఇన్స్‌పెక్టర్ రామకృష్ణశాస్త్రి సిబ్బందికి సూచనలు జారీ చేశారు. చిత్తూరు ప్రొహిబిషన్,ఎక్సైజ్‌సూపరిడెంట్ శ్రీనివాసులునాయుడు,డిపో ఇన్స్‌పెక్టర్ లక్ష్మణరావు ఆదేశాల మేరకు గురువారం కార్వేటినగరం మండలంలోని వివిధ ప్రభుత్వ మద్యం దుకాణాలను అకస్మిక తనిఖీలు చేశారు. ఆన్‌లైన్ ఆఫ్ ద్వారా నిల్వగల స్టాకును సిబ్బంది సహాయంతో నిశితంగా పరిశీలించారు. ఈ తనిఖీలలో ఆయన వెంట వెరిఫికేషన్ ఆఫీసర్ కుమార్,జాన్సన్‌తో పాటు సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## పోరాటాలతోనే సమస్య సాధ్యం

**కార్వేటినగరం, జనవరి 11 ప్రభాతవార్త:**



ఏ సమస్యయినా పోరాటాలతోనే సాధ్యమవుతుందని ఐసిడియస్ యూనియన్ కార్యదర్శి మమత అన్నారు. కార్వేటినగరం ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో31వరోజుఅంగన్‌వాడీ నిరవధిక సమ్మెలో భాగంగా పాల్గొని ప్రసంగించారు. పండుగ సెలవులు పిల్లలకు ప్రకటించడంతో తల్లులు పిల్లలతో ఉద్యమంలో పాల్గొన్నామన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల జీతభత్యాలు అప్పట్లో 250రూపాయిలనుంచిప్రస్తుతం11,500వరకుఅంగన్‌వాడీఉద్యోగులు పోరాటాలతోనే సాధించుకున్నామని ఎవరూ జీతాలు పెంచి ఇవ్వలేదని,ఇకపై కూడా ఉద్యోమాలతోనే సాధించుకుంటా మన్నారు. రాణి,సుగుణ,మంజుల,భాను,వళ్ళి,చెంచులక్ష్మి,ఉమ,లక్ష్మీనరసమ్మ,అంగన్‌వాడీఉద్యోగులుపాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ మామిడి రైతులకు పలు ప్రోత్సాహకాలు

**తవణంపల్లె, జనవరి 11 ప్రభాతవార్త:**

మండలంలో కొత్తగా మామిడి మొక్కలు నాటిన ఎస్సీ, ఎస్టీ రైతులకు ఉద్యానశాఖ ద్వారా మూడేళ్ళ పాటు పలు రకాల ప్రోత్సాహక రాయితీలు అందిస్తున్నట్లు బంగారుపాళ్యం ఉద్యాన అధికారి సాగరిక తెలిపారు. ఈమేరకు మామిడి పంటకు పిచికారి చేసే మెషిన్‌లు, తైవాన్ స్ప్రేయర్లు, కలుపు తీసే మిషన్‌లు 50 శాతం సబ్సిడీపై అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈఅవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ మామిడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని సాగరిక తెలిపారు.

## ఘనంగా వడ్డెర ఓబన్న జయంతి

**చిత్తూరురూరల్, జనవరి 11 ప్రభాతవార్త:**

చిత్తూరు పట్టణం, గాంధీ సర్కిల్ నందు గురువారం వడ్డెర కులస్తుల ఆరాధ్యదైవం, రేనాటి వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి నమ్మిన బంటు వడ్డెర గోపన్న జయంతిని వడ్డెర సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షులు రవీంద్రరాజు, సీమాంధ్ర బిసి సంఘ రాష్ట్ర అధ్యక్షులు మురగయ్య ఆద్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించి పూలమాల వేసి పూజలు నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి పేదలకు అన్నదానం చేసారు. ఈ కార్యక్రమంలో వడ్డెర కార్పొరేషన్ డైరెక్టరు పద్మప్రియ, కోశాధికారి సుబ్రమణ్యం, యువత జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వైసి హరిబాబు, రుద్రయ్య, సంఘ నాయకులు నంజుండప్ప, మునిరాజులు, లక్ష్మయ్య, చిరంజీవి, ధరణిప్రకాష్, ప్రియ, శాంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఆడుదాం ఆంధ్రాకు మంచి స్పందన

**బంగారుపాళ్యం, జనవరి 11 ప్రభాతవార్త:**



ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలకు మంచి స్పందన లభిస్తోంది. గ్రామ సచివాలయ పరిధిలో జరిగిన క్రీడా పోటీల్లో గెలుపొందిన వారికి మండల స్థాయిలో పోటీలను అధికారులు చేపట్టారు. మండల స్థాయిలో జరుగుతున్న క్రీడా పోటీలకు క్రీడాకారులు, ప్రజల నుండి మంచి స్పందన లభిస్తోంది. గురువారం బంగారుపాళ్యం ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాలీబాల్, క్రికెట్ పోటీలను అధికారులు నిర్వహించారు. తగ్గువారిపల్లి క్రీడా మైదానంలో కబడ్డీ, ఖోఖో పోటీలు చేపట్టగా, ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో బ్యాడ్మింటన్, నలగాంపల్లి క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలను నిర్వహించారు.కబడ్డీ,వాలీబాల్ క్రీడలను అధిక సంఖ్యలో క్రీడాభిమానులు తిలకించారు. ఈ కార్యక్రమాల్లో ఇన్‌ఛార్జీ ఎంపిడిఓ హరిప్రసాద్‌రెడ్డి, ఇన్‌ఛార్జీ ఇఓఆర్డీ దుర్గాప్రసాద్, మాజీ సర్పంచ్ కృష్ణమూర్తి, గ్రామ కార్యదర్శులుశంకరయ్య,అవంతి,మధు, సచివాలయ సిబ్బంది, వార్డు సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఘనంగా వడ్డెర ఓబన్న జయంతి వేడుకలు

**శాంతిపురం/వి.కోట, జనవరి 11 ప్రభాతవార్త** స్వాతంత్ర్య సమర యోధుడు వడ్డెర ఓబన్న217వ జయంతిని గురువారం శాంతిపురం తులసినాయనపల్లి, వి.కోట అంబేద్కర్, వైఎస్సార్ సర్కిళ్లలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఓబన్న చిత్రపటానికి పూజలు చేశారు. వడ్డెర కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పెద్దన్న మాట్లాడుతూ ఓబన్న వడ్డెర్లకు ఆదర్శమన్నారు. త్వరకలోనే వడ్డెర కమ్యూనిటీ హాలు నిర్మించడం జరుగుతుందన్నారు. ఇందుకు 88సెంట్లు స్థలం కేటాయించాలని మంత్రి పెద్దిరెడ్డి రామచం ద్రారెడ్డిని కోరామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో వడ్డెర నేతలు రమణప్ప, సర్పంచ్ చెంగమరాజు, వినాయక, రవి, కళావతి, వీరభద్ర, మురుగేష్, వడ్డెర కులస్తులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## వైభవంగా హనుమజ్జయంతి వేడుకలు

**గంగాధర నెల్లూరు, జనవరి 11 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని వేల్కూరు గ్రామంలో వెలసిన శ్రీ సీతారామ లక్ష్మణ భరత హనుమత్సరా వార వీరాంజనేయ దేవస్థానంలో 32వ వార్షికోత్సవ హనుమజ్జయంతి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలను నిర్వహించి అర్చనాదిపూజలతో పాటు తిరుప్పావై పారాయణం పుణ్యాహవచనములు రక్షాబంధనం కలస పూజ న్యాసాధి హోమములు పూర్ణాహుతి శాత్తు మొదలగు పూజలు నిర్వహించారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకున్నారు. ఫిబ్రవరి 2వ తేది శుక్రవారం సీతారామ కళ్యాణ మహోత్సవం నిర్వహించ బడునని ఆలయ అర్చకులు నరసిహన్ అయ్యంగార్ తెలిపారు.

## పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరిద్దాం : కూరపర్తి

**చౌడేపల్లి, జనవరి 11 ప్రభాతవార్త**

ప్రజారంజక పాలననందిస్తూ పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరిద్దామని రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ సభ్యుడు కూరపర్తి అంజిబాబు అన్నారు. మండలంలోని కాగతి, దిగువపల్లి పంచాయతీ కేంద్రాల్లో ఐకెపి సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరాపై అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసారు. నిత్యం ప్రజాక్షేమం, అభివృద్ధిని ఆకాంక్షించే వైకాపా ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికల్లో ఆదరించాలని కోరారు. మండల ఉపాధ్యక్షుడు నరసింహులుయాదవ్, రాష్ట్ర పాల ఏకిరిల కార్పోరేషన్ సభ్యుడు కొండపల్లి రమణ, రఘు, కరణంవారిపల్లి గిరి, రమేష్, సర్పంచులు, ఎంపిటీసీ సభ్యులు షంషీర్, సోనీ, వెంకట్రెడ్డి, తొండా శ్రీరాములు, ఐకెపి ఎపిఎం నర్సోత్తమరెడ్డి, సిసిలు, సంఘమిత్రలు, ఐకెపి సంఘాల మహిళలు పాల్గొన్నారు.

## జిజెఎం ట్రస్ట్ తరపున వికలాంగుడికి ఆర్థికసాయం

**చిత్తూరురూరల్, జనవరి 11 ప్రభాతవార్త:**



చిత్తూరుపట్టణం, కొంగారెడ్డిపల్లెకు చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ కార్యకర్త, వికలాంగుడైన శంకర య్యకు జిజెఎం ఛారిటబుల్ ఫౌండేషన్ తరపున తరపున తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు, గురజాల జగన్ మోహన్ రూ.25వేల ఆర్థికసాయాన్ని అందజేసారు. మాజీ కార్పొరేటర్ శేషాద్రినాయుడు, మదన్, రాధాక్రిష్ణ, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## బి.సి సంఘం సమావేశాన్ని జయప్రదం చేయండి

**కార్వేటినగరం,జనవరి 11 ప్రభాతవార్త:**

గంగాధరనెల్లూరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ వి.ఎం.థామస్ సూచనల మేరకు 12న శుక్రవారం మద్యాహ్నం 2.30గంటలకు ఠానా నుండి గంగాధరనెల్లూరు వరకు బి.సి.ర్యాలీ,అనంతరం గంగాధరనెల్లూరు మండలకేంద్రంలో రాజారత్నం బిల్డింగ్ నందు బి.సిల సంఘం సమావేశం జరుగునని నియోజకవర్గ బి.సిసెల్ అధ్యక్షులు మేళం రవియాదవ్ తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఆరుమండలాల ముఖ్య నాయకులు, బి.సిల సంఘం అధ్యక్షులు,బిసి సాధికారసమితి అధ్యక్షులు,రాష్ట్ర, జిల్లా,నియోజకవర్గ,మండలం,క్లష్టర్ ఇన్‌చార్జిలు,యూనిట్‌ఇన్‌చార్జిలు, బూత్‌కన్వీనర్లు,సెక్షన్‌ఇన్‌చార్జిలు, దేశంపార్టీ నాయకులు,కార్యకర్తలు,అభిమానులు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు.

## తెదేపా టికెట్ ఆశిస్తున్నా: బడి సుధాయాదవ్

**యర్రావారిపాలెం జనవరి11ప్రభాతవార్త**



వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసేందుకు తాను తెదేపా నుంచి టికెట్ ఆశిస్తున్నానని రాష్ట్ర ఓబీసీ ఫోరం కన్వీనర్ బడి సుధాయాదవ్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీలలో అన్ని రాజకీయ పార్టీల నేతలతో పార్టీలకు అతీతంగా కలిసి మాట్లాడానని చెప్పారు. ఇప్పటికే పలు మార్లు మాజీ ముఖ్యమం త్రి నారాచంద్రబాబు నాయుడును కలిసి చర్చించినట్లు తెలిపారు. తన వెంట ఉన్న నాయకులు, కార్యకర్తలకు ఆత్మీయులకు మిత్రులకు పార్టీలకు అతీతంగా క్యాలండర్లు, స్వీట్లు పంపిణీ ప్రారంభించానన్నారు. తన రాజకీయ జీవితం ప్రారంభించి 20 ఏళ్ల పూర్తయిందని చెప్పారు. మాజీ మంత్రి గల్లా అరుణకుమారి ఆశీస్సులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానన్నారు. సుదీర్ఘ రాజకీయ అనుభవంతో అందరిని కలుపుకుని భారీ మెజార్టి సాధిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## వేనాటి సతీష్‌రెడ్డి ఆత్మీయ పలకరింపులు

**సూళ్లూరుపేట, జనవరి 10 ప్రభాతవార్త**



శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి నూతన సంవత్సరంలో ఆత్మీయ పలకరింపులు కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు. గురువారం ఆయన బాపూజీవీధి, కచ్చేరి వీధి, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలను, అభిమానులను ఆత్మీయంగా పలకరించారు. వారికి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వేనాటి సతీష్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్‌లో తెలుగుదేశం పార్టీని సూళ్లూరుపేట ప్రాంతంలో పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. తాను ప్రణాళికబద్ధంగా ప్రతి కార్యకర్తను వ్యక్తిగతంగా కలుసుకొని, ప్రజా సమస్యలను కూడా తెలుసుకొని రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే వాటిని పరిష్కరించేందుకు తన శాయశక్తులా ప్రయత్నిస్తానని వేనాటి సతీష్‌రెడ్డి భరోసా ఇస్తున్నారు. వేనాటి సతీష్‌రెడ్డి ఆత్మీయ పలకరింపులు పేరుతో సూళ్లూరుపేట పట్టణంలో పర్యటిస్తుండటంతో ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహం చోటుచేసుకుంది.

## జిల్లాస్థాయి పోటీల్లో జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థుల ప్రతిభ

**సూళ్లూరుపేట, జనవరి 10 ప్రభాతవార్త**



జన భగీధరి కార్యక్రమంలో భాగంగా జిల్లా స్థాయిలో ఇటీవల తిరుపతిలో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో సూళ్లూరుపేట జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేడ్కర్ బయోగ్రఫి అనే అంశం మీద నిర్వహించిన పోటీల్లో హైస్కూలుకు చెందిన ఎస్.హిమ హంసిని ప్రథమ బహుమతి, పి.నాగపూజ ద్వితీయ బహుమతి అందుకున్నారు. వకృత్వ పోటీల్లో యశస్విని ప్రథమ బహుమతి, ఎస్.హిమహంసిని ద్వితీయ బహుమతిని కైవసం చేసుకున్నారు.

## వెంకటగిరి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి నేనే.. గెలుపు నాదే

మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

**వెంకటగిరి, జనవరి 11, ప్రభాతవార్త**



వెంకటగిరి నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా తానే పోటీ చేస్తున్నానని భారీ మెజార్టీతో విజయం సాధిస్తానని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరిలోని ఆయన నివాస గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. తాను తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. తన పేరు టిడిపి అభ్యర్థుల మొదటి జాబితాలోనే ఉన్నట్లు పత్రికల్లో వచ్చాయని తెలిపారు. సిఎం జగన్మోహన్ రెడ్డి ఎన్నికల ముందు మద్యపానం నిషేదం అమలు చేస్తానని ప్రకటించి గాలికి వదిలేసినట్లు తెలిపారు. అంగన్‌వాడిలు మున్సిపల్ సిబ్బంది సమ్మె చేస్తుంటే వారి డిమాండ్లను పరిష్కరించలేదని విమర్శించారు. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ మూడు నెలల్లో అధికారంలోని వస్తుందని చెప్పారు. సమావేశంలో మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వరరావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంగాధర్, డక్కిలి మండలపార్టీ అధ్యక్షుడుకోటేశ్వర్‌రెడ్డి,నాయకులు సత్యనారాయణ, సుధాకర్, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

## ఆరోగ్యంగానే ఉన్నాను..

ఎస్‌విబిసి చైర్మన్ డాక్టర్ విబి సాయి కృష్ణ యాచేంద్ర

**వెంకటగిరి, జనవరి 11, ప్రభాతవార్త**



తాను ఆరోగ్యంగానే ఉన్నానని శ్రీ వెంకటేశ్వర భక్తి ఛానల్ చైర్మన్ డాక్టర్ విబి సాయి కృష్ణ యాచేంద్ర తెలిపారు. ఇటీవల ఆయన చెయ్యికి హైదరాబాదులో సర్జరీ చేసుకుని వెంకటగిరికి వచ్చిన సందర్భంగా వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు రామ్ కుమార్ రెడ్డి పరామర్శించారు. రూములో జారి పడడం వల్ల చెయ్యి విరగడంతో ఆయన సర్జరీ చేయించుకున్నారు. సర్జరీ అయిన తర్వాత ఆరోగ్యంగా ఉన్నానని చేయకూడదని ఆయన రాంకుమార్ రెడ్డికి తెలిపారు. ఇరువురు పలు రాజకీయ అంశాలపై చర్చించుకు న్నారు. మాజీ ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యాక్షులు రాంప్రసాద్ చంద్ర తదితరులు ఉన్నారు.

## రామాలయ అక్షింతలను పంపిణీ చేసిన నిమ్మ పరిశోధన కేంద్రం అధిపతి

**వెంకటగిరి, జనవరి 11, ప్రభాతవార్త**

నిమ్మచేని పరిశోధన కేంద్రంలోని సిబ్బందికి అయోధ్య రాముడు అక్షింతలను పరిశోధన కేంద్రం అధిపతి మధుమతి పంపిణీ చేసారు. పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న పలువురు సిబ్బందికి వీటిని అందజేసి పూజించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## చిట్టేడులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

**కోట, జనవరి 11 ప్రభాతవార్త**

కేంద్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కోట మండలంలో గురువారం చిట్టేడు,ఊనుగుంటపాళెం గ్రామాల్లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు బైరప్ప మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ తొమ్మిదేళ్ల పాలనలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. వివిధ రకాల సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. డ్రోన్ రైతుల పొలాలపై పిచికారి చేసే విధానాన్ని ప్రత్యక్షంగా చూపించారు. అనంతరం రమేష్ బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం తమ పథకాలగా చెప్పుకొంటూ జగన్ మోహన్ రెడ్డి ఫోటలను పెట్టుకొవడం బాధకరామన్నారు. ఈ కార్యక్రమంలో కోట మండల బిజెపి అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు, ఎంపిపి దాసరి అంజమ్మ, ఎంపిడిఓ భవాని, పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, సుమలత, ఎపిఎం రత్నయ్య, సచివాలయ ఉద్యోగులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మేరిగ మురళీధర్‌కు అభినందనలు

**కోట,జనవరి 11 ప్రభాతవార్త**

గూడూరు నియోజకవర్గం వైకాపా సమన్వయకర్త ఎమ్మెల్సీ మేరిగ మురళిధర్‌కు పార్టీ అధిష్టానం నియమించడంతో కోట మండలం ఊనుగంటపాళెంకు చెందిన వైకాపా నాయకులు తన్నమాల కోటారెడ్డి, సుబ్బారామిరెడ్డి, ముంగమూరి సుబ్రమణ్యం, సుంకర నాగుర్ యాదవ్, ఆయనను ఘనంగా సన్మానించారు. గురువారం వారు గూడూరుకి వెళ్లి మురళిధర్‌ను కలిసి అభినిందించారు. ఈ సందర్భంగా కోటారెడ్డి మాట్లాడుతూ మురిళిధర్‌ను మంచి మోజర్టీతో గెలిపించుకుంటామని చెప్పారు. గతంలో కూడా గూడూరు కు సమన్వయ కర్తగా పని చేసిన అనుభవం ఉందన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలకు కుర్చీలు వితరణ

**నాయుడుపేట, జనవరి 11 ప్రభాతవార్త**

నాయుడుపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఇండియన్ బ్యాంకు ఆధ్వర్యంలో రూ.10,500 విలువ చేసే కుర్చీలు అందజేశారు. బ్యాంకు మేనేజర్ ప్రసాద్ చేతుల మీదుగా ప్రిన్సిపాల్ కల్లూరు గురవయ్యకు కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ ఎస్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ ఇండియన్ బ్యాంకు వ్యాపార రంగంలోనే కాకుండా సామాజిక సేవలోను ఎల్లప్పుడూ ముందు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ అశిష్‌కుమార్, సిబ్బంది హేమంత్‌కుమార్, శంకర్, వంశీ, కృష్ణారెడ్డి, మునికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ కట్టడాలపై ప్రశ్నిస్తే బెదిరింపులా

- టిడిపి పట్టణ అధ్యక్షుడు కందల కృష్ణారెడ్డి

**నాయుడుపేట, జనవరి 11 ప్రభాతవార్త**



నాయుడుపేట పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో మున్సిపాలిటీకి సంబంధించిన స్థలంలో ఓ భూస్వామి అక్రమంగా కట్టడాలు చేస్తుంటే ప్రశ్నించిన వారిని బెదిరింపులకు గురిచేయడం మంచిపద్ధతి కాదని టిడిపి పట్టణ అధ్యక్షులు కందల కృష్ణారెడ్డి అన్నారు. నాయుడుపేటలోని తన నివాసంలో కృష్ణారెడ్డి విలేఖరులతో మాట్లాడారు. కోర్టును తప్పుదోవ పట్టించి అక్రమంగా మున్సిపాలిటీకి సంబంధించిన స్థలాన్ని ఆక్రమించుకోవాలనుకుంటే చూస్తూ ఊరుకోబోమన్నారు.

## తడలో విజయదీపిక పుస్తకాలు పంపిణీ

**తడ, జనవరి 11 ప్రభాతవార్త**



తడ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు బుధవారం విజయదీపిక పుస్తకాలు పంపిణీ చేశారు. వీటి వల్ల విద్యార్థుల ఉత్తీర్ణత శాతం మెరుగవుతుందని అధికారులు తెలిపారు. స్థానిక ఎంపిడిఓ అమోస్‌బాబు చేతులు మీదుగా హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులకు వీటిని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఓ, ఎంఆర్‌సి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఈ-బుకింగ్ చేసుకుంటే రైతులకు ఎంతో మేలు

**తడ, జనవరి 11 ప్రభాతవార్త**

పంట వేసుకున్న రైతులంతా ఈ-బుకింగ్ చేసుకొని లబ్ధి పొందాలని తడ మండల వ్యవసాయాధికారి కాంచన పేర్కొన్నారు. బుధవారం ఆమె మండలంలోని పల్లెపాలెం, తోపుకండ్రిగ తదితర గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడారు. ఈ-బుకింగ్ వల్ల ఉపయోగాల గురించి ఆమె చెబుతూ క్రాప్ ఇన్సు రెన్స్ వంటి ప్రభుత్వ పథకాలు వర్తించాలంటే ఈబుకింగ్ తప్పనిసరిగా చేసుకోవాలని వ్యవసాయశాఖ సిబ్బందికి తమ పొలాల వివరాలు ఆధార్‌కార్డుతో సహా అందిస్తే మేలవుతుందన్నారు. తడ మండలంలోని అన్నిగ్రామాల్లోనూ తాము పర్యటించి రైతులతో ఈ-బుకింగ్ గురించి వివరిస్తున్నట్లు కాంచన పేర్కొన్నారు.

## 13న వాకాడు మండల మీట్

**వాకాడు, జనవరి 11 ప్రభాతవార్త**

ఈ నెల 13 న వాకాడు మండల సర్వసభ సమావేశం మండలాధ్యక్షరాలు కొదవలూరు అనసూ యమ్మ అధ్యక్షతన జరుగుతున్నట్లు ఎంపివిడో గోపినాథ్ తెలిపారు. ఆయన గురువారం విలేకర్లుతో మాట్లాడుతూ ఎంపిపి ఈ సమావేశానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు,అన్ని శాఖల అధికారులు హాజరుకావాలని ఆయన కోరారు. అధికారులు వారి వారి శాఖల నివేదికలను తీసుకొని రావాలని ఆయన సూచించారు. ప్రత్యేక ఆహానితులు మండల స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు.

## గూడూరు పట్టణాన్ని త్వరగా సుందరమయంగా తీర్చిదిద్దాలి

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్‌పర్సన్ దేవసేనమ్మ

**గూడూరు, జనవరి 10 ప్రభాతవార్త**



సంక్రాంతి పండుగల నేపథ్యంలో గూడూరులో పేరుకుపోయిన చెత్తాచెదారాలను మరో రెండురోజుల్లో తరలించి పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని పారిశుద్య కార్యధర్ములు, కార్మికులకు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ సూచించారు. పారిశుధ్య కార్మికులు సమ్మె విరమించారు. దీంతో గూడూరు పట్టణంలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన పారిశుధ్య పనులను ఆమె దగ్గరుండి పర్యవేక్షించారు. సిబ్బందికి సూచనలిచ్చారు. ప్రభుత్వం చర్చలు ఫలప్రదం కావడంతో పారిశుధ్య కార్మికులు సమ్మె విరమించారు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి కార్మికులు విధులకు హాజరయ్యారు. దీంతో స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ గురువారం వేకులజామునే పురపాలక కార్యాలయానికి చేరుకున్నారు. పారిశుధ్య కార్మికులకు సమావేశమయ్యారు. పారిశుధ్యం మెరుగుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సిబ్బంది తక్కువగా ఉన్నప్పుడే పట్టణం పరిశుభ్రంగా ఉండేదని గుర్తు చేశారు. సిబ్బంది ఎక్కువమంది ఉన్నా కార్యదర్శులు దృష్టి సారించకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని ఆమె అన్నారు. అనంతరం బనిగిసాహెబ్ పేట, సాధుపేట తదితర ప్రాంతాల్లో కమిషనర్ వెంకటేశ్వర్లుతో కలిసి దేవసేనమ్మ పర్యటించారు.సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## హిందు ముస్లిం సమైక్యతా సమావేశం విజయవంతం

**గూడూరు, జనవరి 10 ప్రభాతవార్త**

హిందూ-ముస్లిం సమైక్యతా సమా వేశాన్ని విజయవంతంగా నిర్వహించారు. గూడూరు పట్టణంలోని డాక్టర్ సిఆర్ రెడ్డి పెన్షనర్ల భవనం లో జై భారత్ నాయకుల ఆధ్వర్యంలో గురువారం హిందూ-ముస్లిం సమైక్యతా దినాలలో భాగంగా సమావేశం పట్టణ స్థాయి సమావేశం నిర్వహిం చారు. వివిధ మతాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జైభారత్ జాతీయ కార్యదర్శి ఖదిజ్ఞాసి యోధ లోకనాథ్ మాట్లాడుతూ హిందూ-ముస్లిం ఐక్యత ఆవశ్యకతను తెలియజేశారు. భారతదేశంలో మత సామరస్యాన్ని కాపాడుకునేందుకు జయహో చేస్తున్న నిరుపమాన కృషిని వివరించారు. ఎన్నికైన గూడూరు పట్టణ స్థాయి జయహో నాయకత్వంలో జయహో గూడూరు పట్టణ అధ్యక్షులుగా చిలకల వీరయ్య, గౌరవాధ్యక్షులుగా నాశిన భాస్కర్ గౌడ్, ఉపాధ్యక్షులుగా అన్వర్‌బాషా, బల్లవోలు మహేష్, ప్రధాన కార్యదర్శిగా చాంద్‌బాషా, కార్యదర్శిగా గడ్డం నాగమణి ఎన్నికయ్యారు. జాతీయోద్యమ స్ఫూర్తిగా వివిధ మతాలకు చెందిన ప్రతినిధులతో మొదలై గాంధీజీ శాంతి ప్రతిజ్ఞతో ముగిసిన ఈ సమావేశంలో జై భారత్ ఎస్సీ పోరాట వేదిక రాష్ట్ర కార్యదర్శి ఖదిజ్ఞాసి నాగరాజు, జైహో రాష్ట్ర కార్యదర్శులు ఖదిజ్ఞాసి మహేష్, ఖదిజ్ఞాసి రాబర్ట్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## కోళ్ల పందాలపై దాడులు

**కోట,జనవరి 11 ప్రభాతవార్త**



కోట మండలం కర్లపూడి గ్రామం సమీపంలో గురువారం సాయంత్రం కోళ్ల పందెల నిర్వాహకులకుపై కోట ఎస్.ఐ పి.నాగబాబు తన సిబ్బందితో దాడులు చేశారు. ఆమేరకు పందెం రాయుళ్ల నుంచిరూ 3,100 రెండు కోళ్లను,ముగ్గురినిఅదుపులోకి తీసుకొన్నట్లు ఎస్.ఐనాగబాబు చెప్పారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని మండలంలో ఎక్కడైన కోళ్ల పందెలు నిర్వహిస్తే తాట తీస్తానని ఆయన హెచ్చరించారు. ఇప్పటికి ఎస్.ఐ. నాగబాబు కొత్తపట్నం, గూడలి,తదితర గ్రామాల్లో కోళ్ల పందెళ్ల పై విస్తృతంగా దాడులు చేసి ఆదుపు చేశారు.

# అంబేద్కర్ స్ఫూర్తితో పేదల అభ్యున్నతికి జగన్ కంకణం - ఎంపీ రెడ్డప్ప


డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జీవిత ఛాయచిత్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎంపీ రెడ్డప్ప, జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు.

చిత్తూరు, జనవరి 11 ప్రభాతవార్త:
రాజ్యంగ నిర్మాణ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్ఫూర్తితో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి నిరంతరం కృషి చేస్తున్నారని ఎంపీ రెడ్డప్ప పేర్కొన్నారు. పిసిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం సామాజిక సమతా సంకల్పంలో భాగంగా ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ను ఎంపీ రెడ్డప్ప జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, మేయర్ అముద, డిఆర్‌ఓ రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ రెడ్డప్ప విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి విజయవాడలో 20 ఎకరాల విస్తీర్ణంలో 125 అడుగుల ఎత్తుతో రాజ్యంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కాంస్య విగ్రహంను సుమారు రూ.450 కోట్ల ఖర్చు చేసి ఏర్పాటు చేశారన్నారు. గతంలో జమిందార్లు వంటి వారికే సొంతమైన ఓటు హక్కుని రాజ్యంగం ద్వారా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించారని, మన జాతీయ జెండా నిర్మాణంలో అశోక చక్రంను ఆయన సూచించడం జరిగిందన్నారు. మానవాళి కోసం, మానవీయత కోసం అట్టడుగు వర్గాల అభివృద్ధి కోసం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కృషి చేశారన్నారు. సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సైతం డాక్టర్ బిఆర్ అబేద్కర్ స్ఫూర్తితో అట్టడుగు వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారన్నారు. జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు మాట్లాడుతూ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 19న విజయవాడలో సుమారు 20 ఎకరాల విస్తీర్ణంలో 125 అడుగుల ఎత్తు గత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కాంస్య విగ్రహంను ఆవిష్కరించనున్నారన్నారు. జిల్లా నుండి ఈ కార్యక్రమం పండుగ వాతావరణంలో జరిగిలే పక్కా ఏర్పాట్లు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, సాంఘీక సంక్షేమశాఖ డిడి డాక్టర్ రాజ్యలక్ష్మీ, జడ్పీ సిఇఒ ప్రభాకర్‌రెడ్డి, బీసీ కార్పొరేషన్ ఇడి శ్రీదేవి, మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ, డివిఎంసి సభ్యులు వి.రాజ్‌కుమార్, పి.బాబు, ఎ.దేవరాజులు, ఆల్‌ఇండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎస్.మునస్వామి, వివిధ ఎస్సీ, ఎస్టీ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ మజీద్, అధ్యాపకులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు న్యాయం చేయండి

### - సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి



గూడూరు, జనవరి 11 ప్రభాతవార్త
గూడూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు గురువారానికి 31వ రోజుకు చేరుకుంది. జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శి కందారపు మురళి శిబిరం వద్దకు చేరుకొని అంగన్‌వాడీ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించకుంటే జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అధోగతి పడుతుందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజల పట్ల అమానవీయంగా ప్రవర్తిస్తోందని విమర్శించారు. అంగన్ వాడీ లపై ఎస్మా ప్రవేశపెట్ట దానికి ఆయన తప్పుబట్టారు. గూడూరు అంగన్‌వాడీల పోరాట పటిమను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జి.బాలసుబ్రహ్మణ్యం, అంగన్‌వాడీ అధ్యక్షురాలు ఎ.ఇంద్రావతి, కార్యదర్శి బిఎస్ ప్రభావతి, రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, గూడూరు పట్టణ సిఐటియు అధ్యక్షులు బివి రమణయ్య, కార్యదర్శి ఎస్.సురేష్, మున్సిపల్ జిల్లా కార్యదర్శి బి.గోపీనాథ్, ఆర్.శ్రీనివాసులు, గుర్రం రమణయ్య, బి.చంద్రయ్య, ఎ.ప్రసాద్, సుబ్బయ్య, సెక్టార్ లీడర్స్ పెంచలమ్మ, మునికుమారి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గూడలికి చేరిన అయోధ్య అక్షింతలు



కోట,.జనవరి 11 ప్రభాతవార్త
కోట మండలం గూడలి గ్రామానికి గురువారం అయోధ్య శ్రీరామచంద్రుని అక్షింతలు చేరాయి. తిరుపతి జిల్లా అర్చక సలహా మండలి సభ్యులు దీవి అనంతబాబు సమరసత సేవా సంస్ధ జిల్లా కన్వీనర్ కొండూరు వెంకటరమణారెడ్డి చేతుల మీదగా అంద చేశారు. ఈ సందర్భంగా అనంతబాబు మాట్లాడుతూ ఈ నెల 22 వ తేదిన అయోధ్యలో ప్రాణ ప్రతిష్ట మహోత్సవాల సందర్భంగా స్వామి వారి అనుగ్రహం పొందదానికి అయోధ్యలో బాలరామునికి అర్చన చేసిన అక్షింతలు దేశంలోని కాకుండా విశ్వ వ్యాప్తంగా ఉన్న ప్రతి హిందువు ఇంటికి చేర్పించాలనే ఉద్దేశ్యంతో శ్రీరామ జన్మభూమి తీర్ద క్షేత్ర ట్రస్ట్ వారు అక్షింతలు పంపించారన్నారు. తిరుపతి జిల్లా ధర్మ ప్రచారక్ ఏటూరు శ్రీనివాసులు రెడ్డి మాటాడుతూ అయోధ్యలోని శ్రీరాముని విగ్రహ ప్రతిష్ట మహోర్తం సందర్భంగా సాయంత్రం ఐదు దీపాలను వెలగించి తమ ఇంటి ముదు స్వామి అనుగ్రహాన్ని పొందాలన్నారు. ప్రతి ఇంటికి రామనామ స్మరణతో భక్తి సంకీర్తనలతో శ్రీరాముని చంద్రుని అక్షింతలు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో కొనసాయిబాబ, పల్లోలు రాజనాల, పల్లోలు బుల్లయ్య, రాఘవులు,తదితరలు పాల్గొన్నారు.

## ప్యాచ్ వర్కులు త్వరగా చేయిస్తాం

### మంత్రి రోజా



నగరి, జనవరి 11 ప్రభాతవార్త:
ప్యాచ్ వర్కులు త్వరగా చేయిస్తాం అంటూ మంత్రి రోజా అన్నారు. గురువారం మున్సిపల్ పరిధి కేవీపీఆర్ పేటలో ఛిద్రమైన కల్వర్టును అధికారులు, కౌన్సిలర్లతో పాటు ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానికులు తన దృష్టికి తెచ్చిన మేరకు ప్రత్యక్షంగా కల్వర్టును పరిశీలించడం జరిగిందన్నారు. త్వరలో ప్యాచ్ వర్కు చేయాలని అధికారులకు సూచించామన్నారు. ఇప్పటికే వార్డులో కోటి రూపాయల మేర రోడ్లు, డ్రైనేజీలు తదితర అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి గడప గడపకు తిరుగుతూనే ఉన్నామని ప్రజల మధ్యే ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. పార్టీలకు అతీతంగా పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు గంగాధరం, మురుగ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## గిరి ప్రదక్షిణకు విస్తృత ఏర్పాట్లు: సంక్రాంతి సంబరాలు



శ్రీకాళహస్తి,జనవరి 11 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే సంక్రాంతి సంబరాలకు విస్తృతస్థాయి ఏర్పాట్లును ఆలయాధికారులు చేపట్టారు. మూడు రోజులుగా ఏర్పాట్లను ఆలయ ఇఒ కె.యస్ రామారావు తన సిబ్బందితో సమీక్షించారు. అంతేకాక ఆర్‌డిఓగా గతంలో పని చేసిన ఆయనకు ఇక్కడి ఆలయంలో ఉత్సవాలకు సంబంధించి అవగాహన ఉంది.దాంతో ఆయన సిబ్బందితోనూ, అర్చకులతో నాయకులతో చర్చించారు. ఆలయంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించటం ఆనవాయితి.ధనుర్మాసం ప్రారంభం అయినప్పటి నుంచి పట్టణంలో ప్రతి రోజూ గొబ్బెమ్మను గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు.ఈ ఏడాది గిరి ప్రదక్షిణ భారీ ఎత్తున నిర్వహించాలని సంక్రాంతి, శివరాత్రి బ్రహ్మోత్సవాలకు బారీ ఎత్తున జనం హాజరౌతారని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి,ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అధికారులను పరుగులు తీయిస్తున్నారు.ఈ నేపధ్యంలో ఈ నెల 16న మంగళవారం కనుమ సందర్భంగా స్వామి అమ్మవార్ల గిరిప్రదక్షిణను నిర్వహిస్తున్నారు.ఇందుకు సంబంధించి ఈ నెల 15న గిరిప్రదక్షిణకు ముందు ప్రదోష మూర్తుల గిరి ప్రదక్షిణను నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు. కాగా ఈ నెల 15న సంక్రాంతి పర్వదినం సందర్భంగాఅమ్మవారిని గొబ్బెమ్మగా బంగారు సింహావాహనంపై గ్రామోత్సవం నిర్వహించుటకు సన్నాహాలు చేస్తున్నారు.

మూడు రోజులు ఆర్జిత సేవలు రద్దు:
శ్రీకాళహస్తీశ్వరాలయంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించే ఉత్సవాల్లో భాగంగా సంక్రాంతి పర్వదినాన నిర్వహించే ఉత్సవాలు,అలాగే గిరి ప్రదక్షిణ సందర్భంగా ఉత్సవర్లు ప్రదక్షిణకు వెళతారు కాబట్టి మూడు రోజుల పాటు భక్తుల ఆర్జీత సేవలు రద్దు చేసినట్లు ఆలయాధికారి కె.యస్ రామారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు,15,16 తేదుల్లో మూడు కాలాల అభిషేకాలను దేవస్థానం రద్దు చేసినట్లు వివరించారు. ఇక రాహుకేతుదోష నివారణ పూజలు యథావిధిగా నిర్వహించబడుతుందని తెలిపారు.

## గణనాధుని సేవలో ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్



కాణిపాకం, జనవరి 11 ప్రభాతవార్త:
ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ మల్లిఖార్జునరెడ్డి గురువారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ సూపరెండెంట్ కోదండపాణి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు. వారి వెంట టెంపుల్ ఇన్స్‌పెక్టర్ విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా తిరుపతి రైల్వే స్టేషన్ 133 జన్మదిన మహోత్సవం




తిరుపతి కార్పొరేషన్, జనవరి 11, ప్రభాతవార్త
తిరుపతి రైల్వే స్టేషన్ మహోత్సవ వేడుకను విశ్రాంతి ఉద్యోగులు, రైల్వే అధికారులతో స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ నిర్వహించారు. భారత ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ చారిత్రాత్మక ప్రాముఖ్యత అద్భుతమైన వారసత్వాన్ని రైల్వే ఉద్యోగులకు గుర్తు చేసేందుకు భావితరాల పిల్లలకు యువత, స్థానిక ప్రజలకు తెలియజేసేందుకు స్టేషన్ మహోత్సవాలను ప్రతిపాదించిందని స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ వివరించారు. ఈ సందర్భంగా స్టేషన్ డైరెక్టర్ కుప్పల సత్యనారాయణ మాట్లాడుతూ రైల్వే వ్యవస్థాపన చరిత్ర, తిరుపతి వారసత్వం తెలియజేస్తూ మీటర్ గేజ్ స్టేషన్‌గా, రెండు లైన్లు స్టేషన్‌గా అతి చిన్న స్టేషన్‌గా 133 సంవత్సరాల క్రితం ప్రారంభమైందన్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం తిరుమలలో నెలకొని ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శించేందుకు వస్తున్న భక్తుల యాత్రికుల రోజు రోజుకు అధికమవుతున్నారని తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్ ఆరు ప్లాట్ ఫామ్‌లతో నిత్యం 80 వేల మంది ప్రయాణికుల రాకపోకలకు సౌకర్యంగా ఉందని తెలిపారు. తిరుపతి స్టేషనన పర్యావరణంలో గోల్డ్ రేటింగ్ సాధించినందుకు గర్వరంగా ఉందన్నారు. తిరుపతి రైల్వే స్టేషన్‌ను 300 కోట్లతో అభివృద్ధి పనులను ఉన్నతాధికారుల పర్యవేక్షణలో వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. స్టేషన్ మహోత్సవ సందర్భంగా పలువురు విశ్రాంతి ఉద్యోగులను స్టేషన్ డైరెక్టర్ సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రైల్వే ఉద్యోగులు విశ్రాంతి ఉద్యోగులు పాల్గొన్నారు.

## ఆరోగ్యకేంద్రం మార్గంలో వీధిలైట్లు - వార్తకు స్పందన



తొట్టంబేడు, జనవరి 11 ప్రభాతవార్త
వార్త దినపత్రికలో ఈనెల 10వ తేదీన 'సిబ్బందికి రక్షణలేని ఆరోగ్య కేంద్రం-భయాందోళనలో స్టాఫ్‌నర్సులు' అన్న శీర్షికన వార్త ప్రచురితం కావడంతో స్పందించి సర్పంచ్ సుబ్బయ్య ఆరోగ్య కేంద్రం మార్గంలో వీధిలైట్లు వేయించినట్లు 'ప్రభాతవార్త'కు వివరించారు. ఈ మార్గంలో లైట్లు లేకపోవడంతో రాత్రి వేళల్లో విధులు ఆస్పత్రిలో విధులు నిర్వహించే స్టాఫ్‌నర్సులు రోజుకొకరు విధులు నిర్వహిస్తుంటారు. శ్రీకాళహస్తి-చెన్నై మార్గం నుంచి ఆరోగ్య కేంద్రానికి వెళ్ళే మార్గంలో వీధిలైట్లు లేకపోవడంతో మహిళా నర్సుపై ఇటీవల కొందరు యువకులు దాడిచేసిన విషయం విదితమే. దీంతో స్పందించి సర్పంచ్ ఈమార్గంలో వీధిలైట్లు వేశారు. మరోరెండు వీధిలైట్లు వేయాలని ఆస్పత్రి సిబ్బంది కోరు తున్నారు.

## సంస్కృతి, సాంప్రదాయాలకు సూచికలు రంగవల్లికలు

### - కుంట్రపాకంలో... సర్పంచ్ స్వంత నిధులతో ముగ్గుల పోటీలు

తిరుపతిరూరల్, జనవరి 11 ప్రభాతవార్త:



ఇండ్ల ముందరవేసే ముగ్గులు మన సంస్కృతి, సాంప్రదాయ, ఆచారాలకు సూచికలని కుంట్రపాకం గ్రామ సర్పంచ్ రాచపాళ్యం శుభపద్మనాభరెడ్డి తెలి పారు. సంక్రాంతి పర్వదినాలను పుర స్కరించుకుని గ్రామ సర్పంచ్ స్వంత నిధులతో గ్రామంలోని మహిళలకు గురువారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేసారు. ముగ్గుల పోటీలలో మొదటి బహుమతి ప్రెషర్ కుక్కర్‌ను రవళి, రెండోవ బహుమతి ఐరన్ బాక్స్‌ను పావని, ముడోవ బహుమతి నాన్ స్టిక్ టావాను అక్షయ, గెలుచుకున్నారు, ముగ్గుల పోటీలలో పాల్గొన్నవారందరికి కూడా బహుమతులు అందజేసారు. ఈ కార్యక్రమంలో కుంట్రపాకం పంచాయతీ కార్యధర్శి నంద్యాల మురళి, కంప్యూటర్ ఆపరేటర్ లక్ష్మీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సంక్రాంతికి శిల్పారామం సిద్ధం

తిరుచానూరు, జనవరి 11, ప్రభాతవార్త
సంక్రాంతి పండుగకు నగర ప్రజలు వివిధ రకాల వినోద కార్యక్రమాలతో ఆనందపరచడానికి శిల్పారామం సిద్ధంగా వుందని శిల్పారామం ఏఓ ఖాదర్ వలీ తెలియజేసారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే సంక్రాంతి వేడుకలు కోసం శిల్పారామం తిరుపతి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలుతో నగర ప్రజలను అలరించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని అన్నారు. 4 రోజులుపాటు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నారని తెలిపారు. ఇందులో భాగంగా శాస్త్రీయ నృత్యం, సిని నృత్యాలు, కామెడి స్కిట్స్, జానపద కళారూపాలు వరుసగా 13,14,15, 16వ తేదీల్లో సాయంత్రం 5 నుండి ప్రదర్శనలు నిర్వహించనట్లు తెలిపారు. 13 వ తేది మాధవి బృందంచే భరతనాట్యం, 14 వ తేది విన్నర్ ఫ్యాషన్ డిజైనింగ్ కాలేజ్ వారి ఆధ్వర్యంలో సంక్రాంతి లక్ష్మి సంప్రదాయ వస్త్రధారణ పోటీలు, స్త్రీలు, పిల్లలుకు ప్రత్యేకంగా, సూత్రప్రదాలయ డాన్స్ స్కూల్ బెంగళూరు బృందంచే భరతనాట్యం నృత్యం, 15వ తేది జబర్దస్ట్ కామెడీ కళాకారుడు రాజమౌళిచే పేరడి పాటలు, కామెడి స్కిట్, నెల్లూరు, తిరుపతికి చెందిన కోటి, రజనీ బృందం వారుచే సినీ నృత్యాలు, 16వ తేది సంధ్య బృందం తిరుపతి వారిచే కూచిపూడి, జానపద నృత్యాలు మొదలగు ప్రత్యేక కార్యక్రమాలుతో అలరించనున్నట్లు తెలిపారు. సాయంత్రం గాలిపటాలు ఎగురవేస్తారు. ఇవియే కాకుండా ప్రత్యేక తినుబండారాల దుకాణాలు, బిర్యానీ కౌంటర్లు నగర ప్రజలకు వినోదంతో పాటు రుచికరమైన వంటకాలు, 30 రకాల వివిధ అమ్యూజ్మెంట్ గేమ్స్ బోటింగ్ కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

## గురుదక్షిణామూర్తికి ప్రత్యేక అభిషేకాలు-అలంకరణ



శ్రీకాళహస్తి,జనవరి 11 ప్రభాతవార్త
చదువుల గురువు గురుదక్షిణామూర్తికి గురువారం షోడషాభిషేకాలు నిర్వహించారు.కాగా పట్టణంలోని కర్నాల వీధి, మద్రాసు వీధిలోని సాయిబాబా ఆలయాలుభక్తులతో కిట కిట లాడాయి. శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన దక్షిణామూర్తికి విశేషాభిషేకాలు నిర్వహించగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు,సభ్యులు పాల్గొన్నారు. ప్రస్తుతం అయ్యప్ప సీజన్ కావటంతో అయ్యప్ప భక్తులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. అభిషేకాలను శ్రీనివాసులు గురుకుల్ నిర్వహించారు. ఆఖండ హారతులను సూరి గురుకుల్ అందించారు. పట్టణంలోని చెన్నై రోడ్డులో వెలసిన సాయిబాబా,కర్నాలవీధిలో బాబాగుడిలో భక్తులు బాబా విగ్రహానికి విశేష సేవలు, పాలాభిషేకాలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని గురుదక్షిణామూర్తికి నిత్యపూజలు, అభిషేకాలకు అలరారుతున్నారు. భక్తుల సంఖ్య పరిమితంగా ఉంది. దాంతో వచ్చిన వారు సుదర్శనం, సత్వర దర్శనం చేసుకున్నారు. రాహుకేతుదోష నివారణ పూజలకు కూడా భక్తులు అంతంతమాత్రంగానే ఉన్నారు.

## శ్రీవారి సేవలోఎమ్మెల్యే ఆదిమూలం



తిరుమల,జనవరి 11ప్రభాతవార్తప్రతినిధి:
శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం ఉదయం సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం దర్శించుకున్నారు. స్వామివారి ఆశీస్సులతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. తిరుమలేశుని దర్శించుకున్న ఆయనకు ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీకోదండరాముల వారికి రాజగోపురం నిర్మించండి..!

### తుడా చైర్మన్, టిటిడి పాలక మండలి సభ్యుడు మోహిత్ రెడ్డికి వినతి

చంద్రగిరి, జనవరి 11 ప్రభాతవార్త:
14వ శాతాబ్దపు కాలం నాటి శ్రీ కోదండరామస్వామి వారి ఆలయానికి టిటిడి యాజమాన్యం రాజగోపురం నిర్మించాలని కోరుతూ చంద్రగిరి ప్రజలు గురువారం తుడా చైర్మన్, టిటిడి పాలక మండలి సభ్యుడు చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పల్లవుల కాలం నాటి ఈ రామాలయం దేవాదాయ ధర్మాధాయ శాఖ నిర్వహణలో కొనసాగుతుండగా చంద్రగిరి ప్రజల విజ్ఞప్తి మేరకు టిటిడిలో విలీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. టిటిడి కళ్యాణ మండపం చంద్రగిరిలో నిర్మించాలనే ఇక్కడి ప్రజల ఛిరకాల కోరికను మన్నించాలని కోరారు. ఆలయం ప్రక్కన గల 2 ఎకరాల ఖాళీ స్థలంలో కళ్యాణ మండపం నిర్మించాలని కోరారు. ఆ మేరకు టిటిడి యాజమాన్యం నుండి శ్రీఘ్రగతిన అనుమతులు సాధించి నిర్మాణ పనులను ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి, వైసిపి పట్టణ అధ్యక్షుడు పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిపి కొత్తపాటి వేణుగోపాల్ రెడ్డి, జానకిరామిరెడ్డి, ఉప సర్పంచ్ నగిరి చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి,సంప్రద్రాయాలను సంరక్షించాలి

### -సంక్రాంతి సంబరాల్లో తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ

తిరుపతి,జనవరి11ప్రభాతవార్త:



సంక్రాంతి సంబరాల ప్రాధాన్యతను చాటిచెప్పే గ్రామీణ ఆటపాటలను వేషధారణలను సంరక్షించి భావితరాలకు అందించాలని తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ చెప్పారు. కమిటీ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. 13వతేదీ శనివారం ఉదయం 10 గంటలకు నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో నిర్వహించే సంక్రాంతి సంబరాలలో భాగంగా గాలిపటాల పోటీలో నగరంలోని పిల్లలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుండాల గోపీనాథ్‌రెడ్డి, కరాటే శ్రీనివాస్, వూకా విజయ్ కుమార్, ,స్విమ్స్ వెంకటేష్ , అజయ్ కుమార్, చెన్నం నవీన్, చంద్రశేఖర్, ఆనంద్, గోపీప్రసాద్, వాసు, హేమకిరణ్, గణపతి, వంశీ,నవీన్ రాయల్, హరి, సుమన్,పూజారి రాఘవేంద్ర, రెడ్డిబాబు, రోషన్, సుబ్రమణ్యం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల జీవితాలతో ఆటలాడుతున్న వైసీపీ : మాజీ మంత్రి అమరనాథరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి అమరనాథరెడ్డి

గంగవరం, జనవరి 11, ప్రభాతవార్త :
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల జీవితాలతో వైసీపీ ప్రభుత్వం ఆటలాడుతుందని,రాబోయే ఎన్నికల్లో ఈ అవినీతి,అరాచక ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి అమరనాథరెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు..తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు పిలుపు మేరకు మాజీ మంత్రి అమరనాథరెడ్డి ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా గురువారం రెండవ రోజు మండలంలోని చౌడిరెడ్డిపల్లె,గంగవరం,జీడిమాకులపల్లె పంచాయతీల పరిధిలోని కురప్పల్లె,బత్తనపల్లె,లక్ష్మీపురం,జీడిమాకులపల్లె,కొంగోళ్ళపల్లె,మారేడుపల్లె, నల్లగుట్లపల్లె గ్రామాల్లో ఆయన పర్యటించారు.ఈ నేపథ్యంలో మండలాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడు,ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఆయన ప్రజలతో మమేకమై బాబు ష్యూరిటీ..భవిషత్తుకు గ్యారెంటీ అనే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో విడుదల చేసిన మినీ మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ అంశాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 5 కోట్ల మంది ప్రజల భవిష్యత్తుకు చంద్రబాబునాయుడు గ్యారంటీ అన్నారు.మహాశక్తి ద్వారా 18 ఏళ్ళు నిండిన మహిళలకు ఆడబిడ్డ నిధి కింద రూ.1500,తల్లికి వందనం పథకం ద్వారా కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుతున్న ఏడాదికి ఒక్కొక్కరికి రూ.15 వేలు,దీపం పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు,ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు టికెట్లు లేని ప్రయాణ సౌకర్యం,అన్నదాత పథకం ద్వారా ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు అందిస్తూ యువగళం పేరుతో నిరుద్యోగ యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తూ ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతిని అందిస్తారని,బిసీలకు రక్షణ చట్టాన్ని తీసుకువచ్చి వారికి అన్ని విధాల అండగా నిలుస్తూ పేదలను సంపన్నులను చేస్తూ ఐదేళ్ళలో పేదల ఆధాయాన్ని రెట్టింపుకు చంద్రబాబు గ్యారంటీ అన్నారు. రాష్ట్రంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. ప్రభుత్వ ఉద్యోగులకు 1వ తేదీన జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితికి తీసుకువచ్చాడన్నారు. ఈ కార్యక్రమంలో కీలపట్ల సర్పంచ్ చంద్రశేఖర్,అడ్వకేట్ సుబ్బరామయ్య,నాయకులు వెంకటేష్ నాయుడు, బత్తిగౌడు,మాజీ సర్పంచ్‌లు మురళీ,రంగప్ప,కె.చిన్నబ్బ, పరమశివ, సూరి, హరి, వసరాయగౌడు, దేవేంద్రరెడ్డి,రెడ్డెప్పరెడ్డి,జయసింహా, ముబారక్‌తాజ్,వసరాయప్ప, నరసింహరెడ్డి, శంకర్‌రెడ్డి, శ్రీనివాసులులతో పాటు పలమనేరు,వికోట,పెద్దపంజాణి,బైరెడ్డిపల్లె మండలాలకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

